విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



తుపాను ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మండౌస్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కరవు సున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చక్రధర్ బాబు చూసించారు. భారత్ మెట్రోలాజికల్ డిపార్టుమెంటు ప్రకటన ప్రకారం మండౌస్ తుపాను నైరుతి బంగాళాఖాతం మీదుగా దాదాపు 470 కిలో మీటర్లకు చేరుకుందన్నారు. జాఫ్నా శ్రీలంకకు ఆగ్నేయంగా 530 కిలోమీటర్లు, చెన్నయ్‌కి ఆగ్నేయంగా 620 కిలోమీటర్లు వద్ద కేంద్రీకృతమై వుందని ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, ఆనుకుని వున్న దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతూ పుదుచ్చేరి- శ్రీహరికోటల మధ్య ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి తీరం దాటే అవకాశం వుందని ఈ కారణంగా గంటకు 65-75 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు 8వ తేదీ రాత్రి నుండి 11వ తేదీ వరకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అక్కడక్కడా వుండవచ్చని తెలిపారన్నారు. ఈ కారణంగా జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా వుండా లని ముఖ్యంగా తీరప్రాంతాల గ్రామాల ప్రజలు , మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని తెలిపారు. వాతావరణ కేంద్రం సూచన లను అనుసరించాలని కోరారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని 10 77 కంట్రోల్ సెంటర్, తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీడిసియల్ అధికారులు, ట్రాన్స్ కో అధికారులతో సమీక్ష సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: విద్యుత్ భవన్ లోని స్కాడా బిల్డింగ్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎనర్జీ ఆంధ్రప్రదేశ్ కె.విజయానంద్ జిల్లాలోని ఎస్పీడిసియల్ అధికారులతో, ట్రాన్స్ కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశం లో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనర్జీ సెక్రటరీ కె.విజయా నంద్ మాట్లాడుతూ జగనన్న కాలనిస్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనిస్ వారికి ఉచిత విద్యుత్ సర్వీసు లను ఇస్తున్నామని సర్వీస్ వైర్, బోర్డ్ ఉచితంగా ఇస్తున్నామని ఎక్కడైనా పనులు నిదానంగా జరిగినట్లు సమాచారం వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం చాల ప్రతిష్టాత్మకంగా తీసుకుని టాప్ ప్రయారిటీ తో జగనన్న కాలనిస్ నిర్మిస్తోందని మన డిపార్ట్మెంట్ సంబంధించిన పనులు ప్రతి అధికారి బాధ్యత గా తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీస్ లు పెండింగ్ లో ఉన్నవాటిని డిసెంబర్ 31 లోగా సర్వీస్ లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లాలోని ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు 1912 ను వినియోగించుకోవాలని తెలిపారు.గృహ వినియోగదారు డైన, వ్యవసాయ వినియోగదారుడైన ఎవరైనా విద్యుత్ అంతరాయల కు సంబంధించి, విద్యుత్ కు సంబంధించిన ఏ విషయమైనా 1912 కు కాల్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం వారు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం లో వచ్చిన ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. పోల్ డ్యామేజ్, లూస్ లైన్స్ తదితర ఫిర్యాదులు వెంటనే పరిష్కరించలని తెలిపారు. సైక్లోన్ అలెర్ట్‌గా వుండాలన్నారు. అధికారులందరు అలెర్ట్ గా ఉండాలని సరఫరా విషయంలో జాగ్రత్తలు వహించాలని మెటీరియల్ అంత సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు వహించాలని లూస్ లైన్స్ ఉంటే వెంటనే గుర్తించి వాటిని సరిచేయాలని, డ్యామేజ్ కండక్టర్ ఉంటే వెంటనే ఎస్టిమేట్స్ వేసి పంపాలని అధికారులను ఆదేశించారు. సబ్ స్టేషన్ లను ప్రతి నెల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఇన్స్పెక్షన్ చేయాలని లేనిచో చర్యలు తీసుకుంటామని తెలిపారు.త్వరలో అకస్మాత్తుగా ఒక సబ్ స్టేషన్ ఇన్స్పెక్ట్ చేస్తానని ఏమైనా తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యుత్ సరఫరా లో అంతరాయలు లేకుండా మెరుగైన విద్యుత్ అందించాలని దానికి అనుగుణంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సంస్థ కు రావలసిన రెవెన్యూ బకాయిలను వెంటనే రాబట్టాలని సంస్థ ఆర్థిక పురోగతి బాగుంటేనే సంస్థ బాగుంటుంది అని బకాయిలు రాబట్టడం సంస్థ ఉద్యోగు లందరి ప్రధమ బాధ్యత అని తెలిపారు. మరియు అధికారులు మరియు సంస్థ ఉద్యోగులు వినియోగదారునికి డిజిటల్ పేమెంట్ లపై అవగాహన కల్పించాలని తెలిపారు.33 కె.వి.లైన్స్, 11 కె.వి.లైన్స్ లను నిరంతరం పెట్రోలింగ్ చేయాలని తెలిపారు.చెట్ల కొమ్మలు మన లైన్స్ కు తగులుతూ ఉంటే గుర్తించి చెట్ల కొమ్మలను తొలగించాలని తెలిపారు. ట్రాన్సుఫార్మర్స్ మైంటైనెన్స్ తప్పని సరిగా చేయాలని తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్స్ ఫీల్డ్ కు వెళ్లి వాస్తవ పరిస్థితు లను తెలుసుకుని దాని కనుగుణంగా వినియోగ దారునికి మనం మెరుగైన సరఫరా ఇవ్వాలని తెలిపారు. వినియోగదారునికి సంతృప్తి కర సేవలు మనం ఎప్పుడు అందించగలమో అప్పుడే మన సంస్థ కు మంచి పేరు అని తెలిపారు.విద్యుత్ భవన్ కాంపౌండ్ లో చెట్లను నాటాలన్నారు. చెట్టును తాను పరిశీలనకు వచ్చినప్పుడు చూస్తానని జాగ్రత్తగా పెంచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, ధర్మజ్ఞాని , చీఫ్ ఇంజనీర్ ట్రాన్స్ కో శ్యామ్ ప్రసాద్ , జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్య ,ట్రాన్స్ కో ఎస్. ఈ. శ్రీనివాస్ , ఎస్. ఈ. ప్రాజెక్ట్స్ ట్రాన్స్ కో ఎన్. ఆర్. సి.రెడ్డి, జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ ఏ. వి.సత్యనారాయణ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ , అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్, ట్రాన్స్ కో అధికారులు పాల్గొన్నారు.

బీసీ మహా సభ విజయవంతంపై మండల బీసీ నాయకుల హర్షం

విశాలాంధ్ర -వలేటివారిపాలెం: వైసీపీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన బీసీ గర్జన మహాసభ విజయవంతం కావడం పట్ల మండలబీసీ నాయకులు ఇరుపని సతీష్, ఇరుపని అంజయ్య,కుంభాల క్రాంతి,చెన్నెబోయిన ఓబులు కొండయ్య, దేగా వెంకటేశ్వర్లు, ప్రగడ వెంకటేశ్వర్లు,యానాది,చప్పిడి రాధాకృష్ణ, మద్దులూరి కొండలరావు, టెంకం కొండలరావు, ఆరేటి మాధవ రావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ విజయ వాడలో జరిగిన బీసీ గర్జనకు వలేటివారిపాలెం మండలం నుంచి భారీగా బీసీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారన్నారు. ఎన్నికల హామీల లో భాగంగా బీసీ కులాల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను మూడున్నర ఏళ్లలోనే పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో బీసీ కులాల అభివృద్ధి కోసం డి బి టి ద్వారా 85 వేల కోట్ల రూపాయలకు పైగా నగదును నేరుగా వారి ఖాతాలకు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. దేశంలో నే కాకుండా ప్రపంచంలో కూడా ఏ రాష్ట్రంలోనూ ఏ ముఖ్యమంత్రి ఇంత పెద్ద నిర్ణయం ద్వారా వెనుకబడిన కులాలకు అందించలేదని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన 70 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి కూడా పేదలకు ఇలాంటి సాయం చేసిన చరిత్ర లేదన్నారు. రాబోయే రోజుల్లో బీసీ కులాలకు వెనుకబడిన తరగతులకు మరింత మేలు చేసే విధంగా జగన్మోహన్ రెడ్డి అడుగులు ముందుకు వేస్తారని వారు తెలిపారు. అన్ని కులాల మతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం వారి జీవితాల్లో వెలుగుల నింపడం జగన్మోహన్ రెడ్డికే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 కి 175 సీట్లు రావడం ఖాయం అన్నారు.

బిజెపి విజయోత్సవ సంబరాలు

విశాలాంధ్ర- నెల్లూరు: గుజరాత్ శాసన సభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన సందర్భంగా బీజేపీ కందుకూరు పట్టణ శాఖ కార్యాలయం లో శ్రేణులు మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్త పరుచుకొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు మన్నేపల్లి వర ప్రసాదరావు, పానేం గాంధీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవయ్య ఉపాధ్యక్షులు మాల్యాద్రి నాయుడు కోశాధికారి చిన్నిపాండురంగయ్య సీనియర్ నాయకులు ముప్పల భూషయ్య, ఘట్టమనేని హరిబాబు, ఆలూరి రాజేశ్వరరావు , మాలకొండారెడ్డి సురేష్ శ్రీధర్ మాటూరి రమేష్ నాయుడు శివ మహేశ్వరరావు చుండి మురళి, చల్లా రాజా పాల్గొన్నారు.

బొమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి అల్లుడు

విశాలాంధ్ర -మనుబోలు: మనుబోలు గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మిరెడ్డి వెంకురెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కుటుంబాన్ని వ్యవసా య శాఖమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అల్లుడు గోపాలకృష్ణ పరామర్శించి తమ సానుభూతి వ్యక్త పరిచారు. బొమ్మిరెడ్డి వెంకు రెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని వివరించారు. బొమ్మిరెడ్డి కుమారుడు హరిగోపాల్ రెడ్డితో వెంకురెడ్డి పేదల మనిషి అని ఆయన ఆశయాలు కొనసాగించాలని కోరారు.

మనుబోలులో 104 సేవలు

విశాలాంధ్ర- మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు రెండవ సచివాలయ పరిధిలో గురువారం 104 సేవలు నిర్వహించారు. డాక్టర్ లక్ష్మి శైలజా రెడ్డి ఆధ్వర్యంలో ఈ వైద్య సేవలో సుమారు 40 మందికి బీపీ షుగర్ పరీక్షలను చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ వైద్య సేవలను నిర్వహించారు. అంతే కాకుండా రోగులకు అవసరమైన సూచనలు సలహాలను వైద్యురాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుభాషిని, ఆశా వర్కర్లు కామేశ్వరి, సునీత, శాంతి, మస్తానయ్య, హెల్పర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వమే రైతులను దగా చేసింది: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: టిడిపి ప్రభుత్వమే రైతులను దగా చేసిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు క్యాంపు కార్యా లయం లో రాష్ట్ర వ్యవసా య శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గురువారం విలేకరులతో మాట్లా డుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పిస్తున్నామని, కొందరు టీడీపీ నేతలకు వ్యవసాయం గురించి ఏమీ తెలియక పోయినా మాట్లాడు తున్నా రన్నారు. గతంలో 13 లక్షల టన్నుల ధాన్యం రాష్ట్రంలో పండు తుంటే ప్రస్తుతం 16 లక్షల టన్నుల ధాన్యం పండుతోందని, రైతులు పండించే ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, కానీ కొన్ని మీడియాల్లో మాత్రం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వ్యవసాయం గురించి పరిజ్ఞానం ఉన్నవారికి వాస్తవాలు తెలుసునని, బహిరంగ మార్కెట్ లో కనీస మద్దతు ధర లేకపోతే ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందన్నారు. టిడిపి అధి కారంలో ఉన్నప్పుడు రైతులను దగా చేశారని, చంద్రబాబు అధికారంలో ఉంటే కరువే..కొన్ని పత్రికల్లో పొంతన లేని వార్తలు రాస్తున్నారన్నారు. టిడిపి హయాంలోనే 2017 నెల్లూరు లోని పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిధుల కుంభకోణం జరిగిం దన్నారు. రైతులను అప్పట్లో మోసం చేశారన్నారు. ధాన్యం సేకరణలో అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రైతులకు బోనస్ పేరుతో టిడిపి హయాంలో బోగస్ జి.ఓ.లు ఇచ్చి తప్పుదోవ పట్టించారన్నారు. టిడిపి హయాంలో సివిల్ సప్లైస్ ను నిర్వీర్యం చేశారన్నారు. ప్రతి రైతును ఆదుకోవాలనే లక్ష్యంతో జగన్ హయాంలో ఈ క్రాప్ విధానాన్ని తీసుకు వచ్చామని, నేరుగా రైతుల ఖాతాల్లోకి నిధులు వేస్తున్నా మన్నారు. ఆర్.బి.కె.ల ద్వారా ధాన్యం సేకరించి మిల్లర్లకు పంపుతున్నామని, రైతులకు సహకారం ఇస్తున్నామన్నారు.ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందిలేకుండా చూస్తున్నామని, ధాన్యం సేకరణలో లక్ష్యం తగ్గించారని కొందరు ప్రచారం చేస్తున్నా రన్నారు. అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, టిడిపి ప్రభుత్వ హయంలో పౌర సరఫరాల సంస్థ కోసం నాబార్డ్ తెచ్చిన నిధులను పసుపు- కుంకుమ కింద చంద్రబాబు అడ్డగోలుగా పంపకాలు చేశార న్నారు. రైతులను అడుగడుగున మోసం చేశారన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ బకాయిలను చెల్లించామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైసీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఎప్పుడు అండగా ఉంటుందని మంత్రి గోవర్ధన్ రెడ్డి అన్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న ఆర్అండ్ బి గెస్ట్ హౌస్

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ డంపింగ్ యార్డును తలపిస్తుంది. అతిధులు విచ్చేసినప్పుడు సేద తీరడానికి, బస చేయడానికి వీలుగా నిర్మించిన ఈ గెస్ట్ హౌస్ మురికి కూపంగా మారింది. శిథిలావస్థకు చేరి పందులకు, మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా గెస్ట్ హౌస్ నిలుస్తున్నప్పటికీ పట్టించుకునే సిబ్బంది కరువయ్యారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు అతిథి గృహంగా ఉండాల్సిన భవనం, పురాతనమైనది కావడంతో ఎవరు ఈ గృహానికి రావడం లేదు. అతిథి గృహాన్ని పునఃనిర్మాణం చేయటంలో అధికారపార్టీ నాయకులు, ఉన్నతాధికారులు స్పందించకపోవటంతో ఆ ప్రాంతం మున్సిపల్ డంపింగ్ యార్డుగా మారింది. రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారి, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది.

సర్పంచులకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర -సీతారాంపురం: సీతారామపురం మండలంలో గ్రామాలకు అవసరమైన నిధులను కేటాయించుకుని అభివృద్ధిపై దృష్టి సాధించాలని ఎంఈఓ మస్తాన్ వలి, ఇ ఓపిఆర్డి భార్గవి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారి పై మండలం లోని చిన్న నాగంపల్లి, పబ్బులేటి పల్లి,గుండుపల్లి, మారం రెడ్డి పల్లి, సీతారామపురం, సింగారెడ్డిపల్లి, అయ్య వారిపల్లి పంచాయతీలకి సంబంధించి ప్రజా ప్రతినిధులు అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఆర్థిక సంవత్సర నిధులును ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ శ్రీనివాస రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జగన్నాథం, డీఆర్డిఏ వెలుగు ఏపీఎం సుధాకర్, సీతారామపురం సర్పంచి కొడవటికంటి భాగ్యమ్మ, అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-నెల్లూరు: కందుకూరు పట్టణంలోని 21 వ వార్డు సంబంధించిన మునగంటి. రాజగోపాలా చారి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ విషయం తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు మాలాద్రి తన వంతు సహాయంగా వైద్య ఖర్చులకు 5 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు సాకినేని. మనోజ్, కందుకూరు పట్టణ టీడీపీ నాయకులు పతకమురి ప్రసాద్, నాదెళ్ల మధు, గుమ్మ శివ, మునగంటి మోహన్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్ పార్మర్ తో పొంచి ఉన్న ప్రమాదం

-భయాందోళనలో గ్రామ ప్రజలు -సమస్య ను పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర- మర్రిపాడు: మర్రిపాడు మండలం ఇర్లపాడు గ్రామ ప్రాథమిక పాఠశాల ఎదురుగా తక్కువ ఎత్తు లో ఉన్న ట్రాన్స్ పార్మర్ తో ఏ క్షణా నైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ గా ఉన్నాయని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు.ప్రధానం గా ఈ ట్రాన్స్ పార్మర్ ఎదురు గా ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ స్కూల్ ఉండడం తో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు భయాందోళన చెందు తున్నారు. వెంటనే ఈ సమస్య పై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

భారీ వర్షాలకు జాగ్రత్తగా ఉండాలి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న భారీ వర్షాలకు నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఏలాంటి విపత్కర పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కార్యాలయంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల సూచనల నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితుల నుంచి సమాచారం తెలుసుకుని వెంటనే స్పందించాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో స్థానికంగా సమస్యలు ఏర్పడితే 18004251113,0861 230 1541 నెంబర్లకు సమాచారం అందించి నగర పాలక సంస్థ నుంచి తగిన సహాయం పొందాలని కమిషనర్ సూచించారు. పాదచారులు, వాహన చోదకులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన ప్రాంతాలలో అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.

భారీ వాహనాలతో ప్రమాదాలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : 16వ డివిజన్‌లో భారీ వాహనాలు తిరగడం వల్ల ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని అనేకమంది ప్రమాదాల గురయ్యారని గత వారం రోజుల క్రితం ఇదే సెంటర్లో భారీ బూడిదతో పోయే లారీలు తిరగరాదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించామని మళ్లీ ముత్తుకూరు రోడ్డు సెంటర్లో పట్టపగలే భారీ వాహనాలు తిరుగుతున్నాయని ఒక వాహన దారుడు భారీ వాహనం ఢీకొట్టపోయిందని వెంటనే స్పందించి సిపిఎం నాయకులు ఇక్కడ భారీ వాహనా లు తిరగకూడదని రోడ్డు మీద బేటాయించి నిరసన తెలిపారు. ట్రాఫిక్ సిఐ ఆరో పట్టణ పోలీస్ వారు అక్కడికి వచ్చి ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సిపిఎం నాయకులు నిరసన విరమించారు. ఈ సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకో వాలని సిపిఎం నాయకులు కాయం శ్రీనివాసులు కోరారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డి భేటీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు తో పాటు పలు అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తిరుమల తరహాలో ప్రతి నెలా పౌర్ణమికి గరుడసేవ

విశాలాంధ్ర -బిట్రగుంట: కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల తరహాలో ప్రతి నెలా పౌర్ణమికి నిర్వహించేలా అంగరంగ వైభవంగా ప్రారంభించిన పౌర్ణమి గరుడసేవలో నెల్లూరు ఎంపీ ఆదాలప్రభాకర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తో కలిసి పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి , ఎంపీ, ఎమ్మెల్యేకు తిరువడివట్టం చుట్టి మంగళ వాయిద్యాలతో ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులు భక్తుల గోవింద నామస్మరణతో నేత్రపర్వంగా దేవదేవుని కార్తీక పౌర్ణమి గరుడ సేవ నిర్వహించారు.

ప్రజాభిమానం, ఆశీస్సులు మెండు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: తనకు ప్రజాభిమానం, ఆశీస్సులు మెండుగా వున్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనతో నడిచే నాయకుల, కార్యకర్తలు తనని ఇష్టపడే శ్రేయోభిలాషులకి ఆయన బహిరంగంగా కొన్ని అభ్యర్థనలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులు మనకి పూర్తిగా ఉన్నాయని, ప్రజల అభిమానం మనకు మెండుగా ఉందని, ఏ సర్వేలు చేసినా నెల్లూరు రూరల్ ఫలితం మనకు అనుకూలంగా, ఏకపక్షంగా వస్తుందని, దీనిన్ని చూసి ఓర్వలేని, తట్టుకోలేని, సహించలేని, తనని రాజకీయంగా, వ్యక్తిగతంగా వ్యతిరేకించే కొంత మంది నాయకులు రకరకాలుగా కుట్రలు, కుతంత్రాలు చేస్తూ, రెచ్చగొట్టే ప్రసంగాలతో, అభ్యంతరకర సోషల్ మీడియా పోస్టింగులతో మనల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారని, ఆఖరికి తన కుటుంబ సభ్యులమీద కూడా సోషల్ మీడియా పోస్టింగులతో, అనుచిత వ్యాఖ్యలు చేసే పరిస్థితికి వచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. రోజు రోజుకు మనపై పెరుగుతున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేని వ్యక్తులు రాబోయేరోజుల్లో మరింత ఉధృతంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు తన కుటుంబ సభ్యులపైన సహితం చేస్తారని, దానిని చూచి నేనుగాని, నా వెంట నడిచే నాయకులుగాని, కార్యకర్తలుగాని, శ్రేయోభిలాషులుగాని రెచ్చిపోతే, దానిని భూచిగా చూపించి ప్రజల్లో మనల్ని పలుచన చేయాలని చూస్తారని, అందుకే వారి కుట్రలు, కుతంత్రాల ఉచ్చులో పడవద్దని, దేనికీ స్పందించవద్దని, అభ్యంతరకర సోషల్ మీడియా పోస్టింగులకి, కామెంట్లు కూడా పెట్టవద్దని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకులకి, కార్యకర్తలకి, శ్రేయోభిలాషులకి అభ్యర్థించారు. తమని రాజకీయంగా ఎదుర్కోలేని వ్యక్తులు చేసే కుట్రల్ని, కుతంత్రాలని ఏ విధంగా ప్రజల అండతో ఎదుర్కోవాలో తమకు భాగా తెలుసునని, ప్రజల ఆశీస్సులతో చెపాల్సిన రోజు, చెప్పాల్సిన చోట, చెప్పాల్సిన సమాధానం ప్రజలే చెబుతారని, నాయకులు, కార్యకర్తలు, తన శ్రేయోభిలాషులు ఈ కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులకిలోను కాకుండా, నిరంతరం ప్రజలో ఉండి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం, అభివృద్ధి కార్యక్రమాల సాధన, సంక్షేమ పథకాల అందజేతమీద దృష్టిసారించాలని కోరారు. తనమీద అక్కసుతో, ఓర్వలేక తనను రాజకీయంగా, వ్యక్తిగతంగా వ్యతిరేకించే వ్యక్తుల ఆగడాలు భరించలేని పరిస్థితి వస్తే, అవసరం అయితే న్యాయపోరాటాలు చేద్దామని, ఎట్టి పరిస్థితుల్లో మనల్ని రెచ్చగొట్టే ప్రసంగాలతో, అనుచిత వ్యాఖ్యలతో, అభ్యంతరకర పోషల్ మీడియా పోస్టింగులతో, ఓర్వలేని పనులు చేస్తున్న వారి ఉచ్చులో పడవద్దని ఎమ్మెల్యే సూచించారు.

సైనిక సంక్షేమ నిధి విరాళాల సేకరణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - పోకూరులి సైనిక సంక్షేమ నిధివిరాళాల సేకరణ సిహెచ్ పద్మజా మేడమ్ ఆధ్వర్యంలో స్కౌట్ మాస్టర్ ఏవి రావు, రమణ, రవిచంద్ర, సులోచన, ప్రమీల, చక్రవర్తి, ఎస్‌విఎల్ నరసింహా రావు స్కౌట్ విద్యార్థుల తో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు అందరు ప్రదర్శనగా కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 7000 రూపాయలు విరాళాల సేకరిం చారు. సేకరించిన మొత్తం విరాళాలను ఉప విద్యాశాఖ అధికారికి అందిస్తామని హెచ్ఎం పద్మజ తెలిపారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ: ఎంపిడిఓ

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మండల అభివృద్ధి అధికారి అమొసు బాబు ప్రత్యక్ష పర్యవేక్షణ లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ముందు గాంధీ చి త్రపటానికి గిలకపాడు సర్పంచ్ కేతా అమర్నాథ్ రెడ్డి పూలమాల వేసి శిక్షణా తరగతులు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ అమొసుబాబు మాట్లాడుతూ ఎంపిటిసిలు, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శుల, సచివాలయ సిబ్బందికి, మహిళా పోలీస్, వెలుగు, ఉపాధి, సంబంధిత లైన్ డిపార్ట్మెంట్,ఫ్రంట్ లైన్ వర్కర్స్, హెల్త్ సిబ్బందికి,ఆశా ఎఎన్ఎంల కు 7వ తేదీ నుండి 9వ తేది వరకు శిక్షణ ఉంటుందని, శిక్షణ పొందిన ట్రైనర్ల తో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇస్తామని బుధవారం 10 పంచాయతీలకు ఆదూరు పల్లి, బొజ్జనపల్లి, గిలక పాడు, కంబాల పల్లి, ఎం.వి.పురం ,నెల్లెపల్లి, చానయపాళెం, సంక్రాంతిపల్లి, తుమాయి, వెపినాపి, పంచా యతీల, ఎంపిటిసిలకు, సర్పంచులకు, సచివాలయ అన్ని శాఖల సిబ్బందికి, హెల్త్, వెలుగు, ఉపాధి శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధి కారి వీర్రాజు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ప్రమాదాలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : 16వ డివిజన్‌లో భారీ వాహనాలు తిరగడం వల్ల ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని అనేకమంది ప్రమాదాల గురయ్యారని గత వారం రోజుల క్రితం ఇదే సెంటర్లో భారీ బూడిదతో పోయే లారీలు తిరగరాదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించామని మళ్లీ ముత్తుకూరు రోడ్డు సెంటర్లో పట్టపగలే భారీ వాహనాలు తిరుగుతున్నాయని ఒక వాహన దారుడు భారీ వాహనం ఢీకొట్టిపోయిందని వెంటనే స్పందించి సిపిఎం నాయకులు ఇక్కడ భారీ వాహనా లు తిరగకూడదని రోడ్డు మీద బేటాయించి నిరసన తెలిపారు. ట్రాఫిక్ సిఐ ఆరో పట్టణ పోలీస్ వారు అక్కడికి వచ్చి ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సిపిఎం నాయకులు నిరసన విరమించారు. ఈ సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకో వాలని సిపిఎం నాయకులు కాయం శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లపు నారాయణ శ్రీనివాస రావు మహేష్ సంపూర్ణమ్మ రాజా బాబు రఘు పాల్గొన్నారు.

నదుల అనుసంధానం ప్రతిపాదన ఎంతవరకు వచ్చింది?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ ఆదాల

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కృష్ణ, గోదావరి, పెన్నా, కావేరి తదితర నదుల అనుసంధానం ప్రతిపాదన ప్రస్తుత పరిస్థితి ఏమిటని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల దీని అమలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందా అని కూడా అడిగారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి విశ్వేశ్వర్ తుడు దీనికి రాత పూర్వకంగా సమాధానం ఇస్తూ జాతీయ దృక్పథ ప్రణాళిక కింద గుర్తించిన 30 లింకు ప్రాజెక్టుల్లో గోదావరి, కృష్ణ, పెన్నా, కావేరి లింకు ప్రాజెక్టు ఒకటని పేర్కొన్నారు. కృష్ణా, పెన్నా, కావేరి బేసిన్లకు జలాలను మరింత మళ్లించడం కోసం మహానది, బ్రహ్మపుత్ర బేసిన్ ల నుంచి మిగతా జలాలను బదిలీ చేయడం ద్వారా గోదావరిని పెంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ లింకు ప్రాజెక్టు అమలుకు కేంద్రం సంప్రదింపులు జరుపుతూ గట్టిగా ప్రయత్నాలు సాగిస్తోందని పేర్కొన్నారు. మహానది- గోదావరి, గోదావరి-కృష్ణ అనుసంధాన ప్రాజెక్టులపై ఏకాభిప్రాయం పెండింగులో ఉందని తెలిపారు. గోదావరిలో లభ్యమయ్యే మిగులు జలాలు గోదావరి బేసిన్ లోని ఇంద్రావతి సబ్ బేసిన్ లో ఉపయోగించని జలాలను గోదావరి- కావేరి లింకు ప్రాజెక్టు ద్వారా మళ్లించడానికి ప్రత్యామ్నాయ అధ్యయనాలు సాగుతున్నాయని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించండి : ఎంపీపీ

విశాలాంధ్ర-ఆత్మకూరు : అధికారులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరగుతున్న శిక్షణా కార్యక్రమాల్లో రెండవ రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామీణ ప్రాంతాలలో ప్రణాళికలు సిద్దం చేసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు సైతం తమ సహకారం అందస్తారని సూచించారు. శిక్షణలో నేర్చుకన్న అంశాలపై అవగాహన పెంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీ శ్రీనివాసులు, పలువురు సర్పంచ్ లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ శ్రావణ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ఆత్మకూరు : అభిరామ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆయన అభిమానులు, ఆసుపత్రి సిబ్బంది గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మున్సిపల్ బస్టాండ్ లో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం అభిరామ్ ఆసుపత్రి వద్ద భారీ ఎత్తున వేడుకలను నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.40,260 నగదు స్వాధీనం

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: మండలంలోని నూకవరం గ్రామం శివారులో పేకాట శిబిరంపై గుడ్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ.సుబ్బారావు, ఎస్ఐ సుదర్శన్ తమ సిబ్బందితో గురువారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 40,260 వేలు రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. 9 మంది నిందితులను వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండల పరిధిలో పేకాట, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని పేర్కొన్నారు.

శాశ్వత భూ హక్కు కల్పన లక్ష్యంతోనే సమగ్ర భూ సర్వే: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రైతుల భూ సమస్యలు పరిష్కరించి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత భూ హక్కు కల్పించాలనే లక్ష్యంతో సుమారు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం వెంకటాచలం మండలం ఎర్రగుంట కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తో కలిసి సర్వేపల్లి నియోజకవర్గంలోని లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలో ఎక్కువగా భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు విన్నవించారని, వారి సమస్యలు అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో అన్నదాతలకు భూ సమస్యలు లేకుండా చేయాలనే సంకల్పంతో వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు కూడా భూములకు సంబంధించి ఖచ్చితమైన సర్వేను చేపట్టేందుకు సాహసించలేదన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క రైతుకు చెందిన భూమికి డ్రోన్ ఫ్లై, ఓ ఆర్ ఐ ఇమేజ్, అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అత్యాధునిక టెక్నాలజీతో సర్వే చేసి ఖచ్చితమైన కొలతలు, హద్దులతో భూ రికార్డులు తయారుచేసి డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి రైతుకు శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఇకపై భూ రికార్డులు లేవు, కనిపించడం లేదనే మాటలు వినిపించకుండా, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూములకు సంబంధించిన పూర్తి వివరాలు సెకన్లలో ఆన్‌లైన్‌లో చూసుకునేలా రీ సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. అగ్రిమెంట్ల మీద ఉన్న సాదా బైనమా భూములకు సంబంధించి అనుభవదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా మంజూరు చేస్తామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని సుమారు 6570 మంది రైతులకు చెందిన 36వేల ఎకరాలను రీసర్వే చేసి శాశ్వత భూహక్కు పత్రాలను అందించామని, మిగిలిన వారికి కూడా త్వరలోనే సర్వే పూర్తి చేసి పత్రాలు అందజేయనున్నట్లు మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి ముందుచూపుతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా రీ సర్వే చేపట్టడం సులభమైందన్నారు. చుక్కల భూముల సమస్యను కూడా జిల్లా స్థాయిలోనే పరిష్కరించుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి కల్పించారన్నారు. భూ సమస్యలను పరిష్కరించి, పుష్కలంగా సాగునీరు అందిస్తే అన్నదాతలకు అంతకుమించిన ఆనందం మరొకటి లేదని, ఆ దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. జేసీ కూర్మనాథ్ మాట్లాడుతూ భూముల రీ సర్వే తో నెల్లూరు జిల్లాను భూ వివాదరహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 118 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, ఫిబ్రవరి మొదటి వారంలోగా మరో 50 గ్రామాల్లో రీ సర్వే పూర్తవుతుందన్నారు. ఇంకా 600 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2023 డిసెంబర్లోగా రీ సర్వేను పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఆర్డిఓ మలోల మాట్లాడుతూ భవిష్యత్తులో ఎవరూ ఏ హద్దును చెరపలేని విధంగా నూతన గ్రామ మ్యాప్ ను తయారుచేసి అత్యాధునిక టెక్నాలజీతో పక్కాగా సర్వేను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సర్వే ఆధారంగా రైతుల భూముల వివరాలన్నీ రీ సర్వే రిజిస్టర్ లో నమోదు చేసి శాశ్వత భూ హక్కు కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు పత్రాలను మంత్రి, అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, తోటపల్లి గూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజా ప్రతినిధులు, సర్వేయ ర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి ఏడీఎఫ్ అంకురార్పణ

నియోజకవర్గంలో లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు సన్నాహాలు

విశాలాంధ్ర- ఆత్మకూరు : ఆత్మకూరు నియోజక వర్గాన్ని సమగ్రంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరి సహాయ సహకారాలతో 'ఆత్మకూరు డెవలప్ మెంట్ ఫోరం' ఏర్పాటు చేస్తు న్న ట్లు ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్ లోఈ నెల10వ తేది ప్రముఖలచే ప్రత్యక్షంగా, వర్చువల్ ద్వారా ఆత్మకూరు అభివృద్ధికి ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్ర మానికి హాజరుకావాలని గురువారం కోరారు. నెల్లూరు లోని క్యాంపు కార్యాలయంలో మీడియా తో ప్రత్యేకంగా సమావే శమ య్యారు. రాజకీయాలకు అతీతంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో గల నిపుణలచే ప్రత్యక్ష, పరోక్ష సహాయ సహకారాలు, సూచనలతో ఆత్మకూరు ప్రజల అభివృద్ధికి సమిష్టిగా సహకరించేందుకు అందరూ కలసికట్టుగా సహకరించాలని, ఇది ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాను ఇటీవల కలిసినప్పుడు నియోజకవర్గం హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారులు ఏర్పాటు కావడం ద్వారా నియోజకవర్గంలో లాజిస్టిక్ పార్కు నిర్మించు కోవడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని సూచించా రన్నారు. ఆంధ్రప్రదేశ్ లోనే అతి పెద్ద రెండో మండలమైన మర్రిపాడుని అభివృద్ధి చేసేందుకు నిపుణులతో చర్చించ నున్నామని అన్నారు. తన సోదరుడు మేకపాటి గౌతమ్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఆశయాలను సాకారం చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వివరించారు. తన అన్న మేకపాటి గౌతమ్ రెడ్డి ఫౌండేషన్ పేరున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ ను అత్యాధునిక హంగులతో ఎమ్ జి ఆర్ ఫౌండేషన్ ద్వారా తమ సొంత నిధులు కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నియోజక వర్గంలో సోమశిల, ఏఎస్ పేట, సంగం, చేజర్ల మండలాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డికి దాదాపు రూ.63 కోట్లకు ప్రతిపాదనలు అందచేశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. మరో జాతీయ రహదారి ఆత్మకూరు నియోజకవర్గంలో మర్రిపాడు, అనంత సాగరం, చేజర్ల మీదుగా కృష్ణపట్నం పోర్టుకు వెళ్లేందుకు మంజూరై త్వరలో పనులు ప్రారంభ మయ్యే దిశగా అడుగులు వేస్తోందన్నారు. తద్వారా ఆత్మకూరు పారిశ్రామికంగా వ్యవసాయ రంగంగా అభివృద్ధి కావడం ఖాయమని అన్నారు.

మేడ్ ఫర్ భారత్ ఈ కామర్స్ ఆవిష్కరణల వృద్ధికి షాప్సీ చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హైపర్ వాల్యూ ఈ - కామర్స్ ప్లాట్ఫామ్ , షాప్సీ బై ఫ్లిప్కార్ట్ ఎక్కువమంది వినియోగదారులకు సేవలు అందించడానికి తమిళ, తెలుగు భాషలలో పరిచయం చేసింది. ఇది వినియోగదా రులు తమ ప్రాధాన్యతా భాషను ఎంచుకునే అవకాశం కల్పించడంతో పాటుగా విస్తృత శ్రేణిలోని అందుబాటు ధరల ఉత్పత్తులను తమ ప్లాట్ఫామ్‌పై వారు అతి సులభంగా పొందే అవకాశమూ అందిస్తుంది. హెట్రోజీనియస్ ఫ్లిప్కార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ న్యూ బిజినెస్ ఆదర్శ్ మీనన్ మాట్లాడుతూ " సౌకర్యవంతమైన షాపింగ్ అనుభవాలను పొందడంలో భాగంగా తమ షాపింగ్ అవసరాల కోసం విలువ ఆధారిత ఉత్పత్తుల కోసం వెదికే వినియోగదారుల కోసం ఆ అనుభవాలను అందించడంలో మా అత్యంత కీలకమైన విలువ ప్రతిపాదన దాగి ఉంది . ఈ నూతన భాషలను విడుదల చేయడమన్నది ప్రజలకు సేవలనందించడానికి తోడ్పడనుందన్నారు.

మహిళలపై హింసను నిరోధిద్దాంపై సదస్సు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: "మహిళలపై జరుగుతున్న హింసను నిరోధిద్దాం - మహిళల హక్కులు, సాధికారతను సాధి ద్దాం" అనే అంశంపై ఐద్వా నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో టౌన్ హాల్ రీడింగ్ రూమ్ లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ అధ్యక్షత వహించారు. సదస్సులో ముఖ్య వక్తలుగా ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ, డీకే డబ్ల్యు మహిళా కళాశాల రిటైర్డ్ లెక్చరర్ భారతి, ప్రముఖ రచయిత్రి పాటూరు అన్నపూర్ణమ్మ, ఆదిశంకర స్కూల్స్ డైరెక్టర్ గౌరీ ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేడు ప్రతి ముగ్గురు మహిళలో ఒకరు దాడికి గురి అవుతున్నారని అన్నారు. భారత దేశంలో ప్రతి ఏటా మహిళల పై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. 2020 లో 3,71503 కేసులు నమోదు కాగా,2021 లో 428,278 కేసులు నమోదు కావడం ఆందోళన కరమైన విషయం అని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు 86 అత్యాచారాలు, సగటున గంటకు 49 నేరాలు మహిళల పై జరుగుతున్నాయన్నారు. హింస అంతులేకుండా పెరుగు తుంటే "కంచే చేను మేసిన చందంలా " మహిళలకు రక్షణగా చేసిన చట్టాలు ధన వంతులకు, అధికార పార్టీ నాయకులకు చుట్టాలుగా మారాయన్నారు. మహిళల పై దాడులకు కారణమైన మద్యం, డ్రగ్స్ ను నివారించాల్సిన ప్రభుత్వాలు టార్గెట్ లు పెట్టి మద్యాన్ని అమ్మించడం సిగ్గుచేటని అన్నారు. డ్రగ్స్ వాడకంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండడం పాలకుల చిత్తశుద్ధిని తెలియచేస్తుందని అన్నారు. మహిళల జరిగే దాడులు నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఐద్వా నిర్వహించే పోరాటాలలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షురాలు సుబ్బమ్మ, రూరల్ నాయకులు శంషాద్, అరిగెల రమమ్మ, మల్లీశ్వరి,సంపూర్ణ, నాజున్ని, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వేదగిరి లక్ష్మీనరసింహ ఆలయంలో అభిషేకాలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానంలో గురువారం పౌర్ణమి తిథి సందర్భంగా ఉదయం ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, సాయంత్రం స్వామి వారి గరుడసేవ గిరి ప్రదక్షిణ ఉత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. ఉభయ కర్తలుగా ఏకోల్లు విజయ రామిరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించగా, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, కార్యనిర్వాహణాధికారి వి. గిరికృష్ణ ధర్మకర్తల మండలి సభ్యులు అల్లూరు దినేష్ కుమార్, నెట్టం రఘు రామయ్య, పామూరు మల్లికార్జున రెడ్డి, రాపురు అంజయ్య, మడపాకుల జయమ్మ, సుంకర మస్తానమ్మ, వినుకోటి ప్రసన్న లక్ష్మి , ఇంట్ల లక్ష్మమ్మ , అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిల హై లెవెల్ పనులపై ప్రభుత్వం నిర్లక్ష్యం:గూటూరు

విశాలాంధ్ర- మర్రిపాడు: టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గూటూరు మురళి కన్నబాబు గురువారం మర్రిపాడు మండలంలో పర్యటించారు. అనంతరం విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ హై లెవెల్ కెనాల్ నిర్మాణంలో అశ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు నత్త నడకన సాగుతున్నాయన్నారు. కెనాల్ పనులకు 850 కోట్ల రూపాయలు మంజూరు కాగా 670 కోట్ల రూపాయల పనులు పూర్తయ్యా యని, గత ప్రభుత్వం పంప్ హౌస్, చెరువులు, కాలువల మోటార్లు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచిందన్నారు. మొదటి పేస్ లో పడమటి నాయుడు పల్లి లో భూ సేకరణ పూర్తి చేసి నష్టపరిహారం అందించే సమయంలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిందని, ప్రస్తుత ప్రభుత్వం మూడున్నర ఏళ్ల గడిచినా నిర్వాసితులకు నష్టపరిహారం అందించలేక చతికిల పడిందని విమర్శించారు. పేజ్ 2లో నాలుగు వందల కోట్ల రూపాయలు పనులకు టెండర్లను పిలువగా 100కోట్ల పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మొదటి పేజ్ లో పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్లకు డబ్బులు మంజూరు చేయకుండా పేస్ 2 లో పనులు పూర్తి చేసి నవారికి ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉన్నాయా అని ప్రశ్నించారు. మొదటి పేజ్ లో ఇక కమిషన్లు రావని, రెండవ పేజ్ లో టెండర్లుపిలిచారు, కమిషన్లు వస్తాయని ప్రభుత్వం వాటి కోసమే పనిచేస్తుంది, కానీ ప్రజల కొరకు చేయటం లేదన్నారు. మొదటి పేజ్ లో పనులు పూర్తి కాకుండా పేజ్ 2లో పూర్తి చేసినా ప్రయోజనం ఉండదని స్థానిక ఎమ్మెల్యే గుర్తించాలని కోరారు. మొదటి పేజ్ లో ఉన్న పడమటి నాయుడు పల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయ కుండా పొంగూరు, కంపసముద్రం రిజర్వాయర్ లకు నీళ్లు ఎలా వెళ్తాయని ఆయన ప్రశ్నించారు.ఈ సమావేశంలో మండల టిడిపి నాయకులు అరికట్ల జనార్దన్ నాయుడు, కర్యావుల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు ఎలగాల వెంకటేశ్వర్లు యాదవ్, పాలెం పోలయ్య, సురేష్ పాల్గొన్నారు.

శివుని విగ్రహం ఏర్పాటు కు శంకుస్థాపన

విశాలాంధ్ర- కోవూరు: కోవూరు మండలం పడుగుపాడు, రుద్ర భూమి హిందూ శ్మశాన ప్రాంగణంలో పరమ శివుని ధ్యాన మూర్తి విగ్రహం ఏర్పాటుకు దాతలు సహకారంతో గురువారం ఉదయం శంకుస్థాపన జరిగింది. ముఖ్య అతిథిగా డిఎల్‌డిఎ డైరెక్టర్ కాటం రెడ్డి దినేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికరుద్ర భూమి అభి వృద్ధిలో భాగంగా దాతలు సహకారం తో శివుని విగ్రహం ప్రతిష్ట కి శ్రీకారం చుట్టి నందుకు దాతలు కు కృతజ్ఞతలు తెలిపారు. తాను కూడా ఇటీవల రుద్ర భూమి అభి వృద్ధికి 1లక్ష రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. నీటి సౌకర్యం కల్పించి నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి శివుని విగ్రహం నిర్మాణం చేపట్ట పోతున్నందున చాలా సంతోషమని దినేష్ రెడ్డి అన్నారు. దాతలో ఒకరైన రిటైడ్ ట్రాన్స్‌కో ఉద్యోగి అక్కరాజు పద్మనాభ రావు మాట్లాడుతూ ఈ పడుగుపాడు రుద్ర భూమిలో మౌలిక వసతులు ఏర్పాటు అవసరం అని. గ్యాలరీ, స్నానపు గదులు, కర్మ క్రియలకు రూములు అవసరం అయిన పనులు మంజూరు చెయ్యాలని ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లామన్నారు. ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి చొరవతో త్వరలో ఈ శ్మశాన వాటిక అభివృద్ధి చెందు తోందన్నారు. 6 మాసాల క్రితం శ్రీనివాసులు రెడ్డి విశ్రాంతి ఉద్యోగి మృతి చెందితే ఆరోజు ఇక్కడ వసతులు లేదని తెలుసు కొని, కొందరు దాతలు సహకారం తో కొన్ని పనులను చేపడుతున్నామన్నారు. తొలుత కాటం రెడ్డి దినేష్ భారీ విరాళం ప్రకటించి నందున అభివృద్ధి మొదలు అయిందని పద్మనాభం అన్నారు. ఈ కార్యక్రమం లో వేద శ్యాంస్క్రిట్ విశ్రాంతి ఉపాధ్యాయులు కోట రాజ శేఖర్, నలగట్ల సుధీర్ రెడ్డి, ఓబ్బారెడ్డి సుబ్బారెడ్డి, పడుగు పాడు వైస్ సర్పంచ్ అహమ్మద్ పాల్గొన్నారు.

అవకతవకలు సరిదిద్దాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నమోదు చేసిన ఓట్ల నమోదు ప్రక్రియలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని, వీటిని సరిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆత్మకూరు మండల శాఖ నాయకులు గురువారం తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ విద్యావంతుల ఎన్నికలలో కూడా ఇలా దొంగ ఓట్లను చేర్చి గెలవాలనుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దీని వల్ల ఎన్నికల వ్యవస్థనే అవమానించినట్లు అయిందని, ఓటర్ల జాబితాను సరి చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వారి వెంట యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.

బోసుబొమ్మ వద్ద హుటాహుటిన నేతాజీ విగ్రహం ఏర్పాటు: జనసేన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేన నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్విరామంగా, నిరా టంకంగా జరుగుతున్న పవనన్న ప్రజాబాట 206వ రోజున 43వ డివిజన్ రాజపుట్ వీధి, పి.ఎస్.ఎం. స్కూల్ ప్రాంతంలో జరిగింది. ఇక్కడ ప్రతి ఇంటికి తిరిగి ప్రజా సమస్యలను అధ్యయనం చేసి పోరాడతామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం ఈ నెల 2వ తేదీన నెల్లూరు నగరంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద పవనన్న ప్రజాబాట 200వ రోజు సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం లేక పోవ డంతో చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పుష్పాంజలి ఘటించి ఈ సంఘటనను తెల్పడంతో హుటాహుటిన ప్రభుత్వ అధికారులు ఇప్పుడు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని, గత కొన్నేళ్లుగా విగ్రహం లేకుండా నిర్లక్ష్యం ప్రదర్శించిన వీరు ఇప్పటికైనా మేల్కొని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పవనన్న ప్రజాబాట కార్యక్రమం తెస్తున్న మార్పులకు ఈ సంఘ టన ప్రత్యక్ష నిదర్శనం అని అన్నారు. ప్రజలందరూ తమని అపూర్వంగా ఆదరిస్తూ ఇంటింటికీ ఆహ్వానించి తమ సమస్యలు ఏకరువు పెడుతుంటే వైసీపీ ప్రభుత్వంలో వణుకు మొదలైందని, తాము లెవనెత్తుతున్న సమస్యలను అధికారులు పలు ప్రాంతాల్లో తీరుస్తున్నారని, సమస్యలు పరిష్కారం కాని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు, డ్రైను కాలువల అభివృద్ధి పనులను కమిషనర్ హరిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ముందు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక మూలాపేట, రామయ్య బడి సమీపంలోని వీధుల్లో, వెంగళ్ రావు నగర్ ప్రాంతంలోని వివిధ వీధుల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. కరెంట్ ఆఫీస్ కూడలిలోని నగర పాలక సంస్థ రూపొందించిన విగ్రహాల ఐ ల్యాండ్ కు మరమ్మతులు చేసి, పెయింటింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. బుజ బుజ నెల్లూరు ప్రాంతంలో జరుగుతున్న డ్రైను కాలువల అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక కొత్తూరు శ్రామిక నగర్ లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, ఉత్తమ వైద్య సేవలు అందించాలని కమిషనర్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ ఆదాల

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఆంధ్రప్రదేశ్‌లో కాయిర్ పరిశ్రమ కోసం ఎంత మందికి మహిళలకు శిక్షణ ఇచ్చారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గురువారం లోక్ సభలో అడిగారు. కేంద్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ రాత పూర్వకంగా సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు ఏళ్లలో దాదాపు రెండున్నర వేల మందికి కాయిర్ పరిశ్రమ కింద శిక్షణను ఇచ్చామని తెలిపారు. 2019-20 లో 1075 మందికి శిక్షణ ఇవ్వగా, అందులో 897 మంది మహిళలని తెలిపారు. 2020-21 లో 873 మందికి శిక్షణను ఇవ్వగా, అందులో 752 మంది మహిళలని, 21-22 లో 718 మందికి శిక్షణను ఇవ్వగా, అందులో 524 మంది మహిళలని తెలిపారు. వీరంతా విజయనగరం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, చిత్తూరు, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వారని పేర్కొన్నారు.

ఏపీలో సీఎన్జీ పంపులు ఎందుకు తక్కువగా ఉన్నాయి?

ఆంధ్రప్రదేశ్‌లో సిఎన్జి పంపులు తక్కువగా ఉండడానికి కారణాలు ఏమిటని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గురువారం పార్లమెంటులో ప్రశ్నించారు. దీనికి పెట్రోలియం సహజవాయువు శాఖ మంత్రి రామేశ్వర్ తేలి రాత పూర్వకంగా సమాధానం ఇస్తూ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ల అభివృద్ధిలో భాగంగా ఈ సీఎన్జీ పంపుల ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు ల్లో ఇటీవల వీటి సంఖ్య పెరిగిందని, త్వరలో అవసరాను గుణంగా విస్తరణ జరుగుతుందని పేర్కొన్నారు.

విధి నిర్వహణలో వీఆర్వో మృతి

విశాలాంధ్ర -జలదంకి: విధులు నిర్వహిస్తూ విఆర్ఓ మృతి చెందిన సంఘటన జలదంకి మండలంలోని గట్టుపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గట్టుపల్లి గ్రామంలో విఆర్ఓ నాగరాజు ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కుప్పకూలారు. గుండెల్లో నొప్పిగా ఉందని స్కూటర్ దిగడంతోనే ఒక్కసారిగా పడిపోయారు. 108 కు ఫోన్ చేయడంతో కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జలదంకి తాసిల్దార్ సిహెచ్ పద్మావతి కావలి ఏరియా ఆసుపత్రికి వెళ్లి డాక్టర్లుతో మాట్లాడారు. నాగరాజు మరణ వార్త రెవెన్యూ అధికారులను కలచి వేసింది.

జలదంకి రాజకీయాలు అధికారుల ప్రాణాల మీదకు తెస్తోందా?

ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు అధికారులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోందని అనడంలో సందేహం లేదు. ఒక్క అధికారి కూడా సరిగా విధులు నిర్వహించ లేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి అధికారులుగా పేరు తెచ్చుకున్న వారు కూడా విధులు నిర్వహించలేకపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొందరు రాజకీయ స్వార్థం కోసం అధికారులను ట్రాన్స్‌ఫర్‌లు చేయిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా తయారయ్యిందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలే అధికారుల పాలిట శాపంగా మారింది అనేది ప్రజలలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. ప్రమోషన్లు రావాల్సిన అధికారులు డిమోషన్లతో తలలు పట్టుకుంటున్నారు.

క్రీడామంత్రి రోజాను అడ్డుకుంటాం: డివైఎఫ్ఐ

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: పే అండ్ ప్లే రద్దు చేయాలని ప్లే గ్రౌండ్స్ ప్రైవేటీకరణ ఆపాలని బహిరంగంగా ప్రకటించకపోతే క్రీడామంత్రి రోజాని అడ్డుకుంటా మని విలేకరుల సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో సెటిల్ టోర్నమెంట్ ప్రారంభించడానికి వస్తున్నారు ఈ సందర్భంగా పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని, క్రీడా మైదానాలను స్టేడియాలను ఇండోర్ స్టేడియాలను స్విమ్మింగ్ పూల్స్ ను జిమ్ కేంద్రాలను యోగ సెంటర్లను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్రీడలలో వెనుకబడిపోయిన ఈ తరుణంలో కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాకారుల పట్ల శాపంగా మారిందని పేద మధ్యతరగతి క్రీడాకారులకు సదుపాయాలు కల్పించడంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ శాప్ విఫలమవుతుందని . క్రీడాకారులు పే అండ్ ప్లే విధానం తెచ్చిన తర్వాత 3 వేల రూపాయలు సభ్యత్వం ప్రతినెల 1500 రూపాయలు చెల్లించి ఆటలు నేర్చుకోవాల్సిన పరిస్థితికి క్రీడాకారులను నెట్టివేశారని దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా పేద మధ్యతరగతి కుటుంబా ల నుంచి మంచి ప్రతిభ కనపరిచిన క్రీడల్లో మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులు క్రీడలకు దూరంగా మారు తున్నారని కోచ్ లకు కూడా ఎండి ప్రభాకర్ రెడ్డి వచ్చిన తర్వాత క్రీడాకారుల నుంచి డబ్బులు వసూల చేసిన వారిని కోచ్లుగా కొనసాగిస్తాం లేకుంటే లేదనే టార్చర్ విపరీ తంగా పెడుతున్నారని దీనివల్ల కోచ్ లు కూడా మానసికంగా ఇబ్బందులకి గురై క్రీడాకారులకు కోచింగ్ ఇవ్వడంలో సరైన ధ్యాస పెట్టలేక పోతున్నారని తెలిపారు. స్టేడియాలను ఇండోర్ స్టేడియాలను స్విమ్మింగ్ పూల్స్ ను యోగా కేంద్రాలను ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పాలనే నిర్ణయం వెనక్కు తీసుకోవాలని కోరారు ప్రైవేటీకరణ జరుగుతే క్రీడాకారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం రోజు వ్యాయామం చేసే ప్రజలు స్టేడియాలలో ఎంట్రీ కావాలన్నా డబ్బులు కట్టి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని కావున ప్రైవేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు. తక్షణమే పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని ప్లే గ్రౌండ్స్ ప్రైవేటీకరణ ఉపసం హరించు కుంటుందని బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి నరసింహ జగదీష్ శేఖర్ పాల్గొన్నారు.